# అందరికోసం.. ఆవిష్కరణలు

# 2023



## 16 సూపర్.. సెల్ఫ్ డ్రైవింగ్

**డ్రైవర్ల అవసరం లేని** వాహనాలు సాకారం అవుతున్నాయి. ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ అనుబంధ సంస్థ జూక్స్ ఈ దిశగా ఓ ముందడుగు వేసింది. డ్రైవర్‌తో పనిలేని స్వయం చోదక వాహనాన్ని అభివృద్ధి చేసింది. డ్రైవర్ అవసరం లేదు కాబట్టి, స్టీరింగ్ వీల్, డ్రైవర్ సీటు లాంటివి లేకుండానే తిరుగుతుంది. అమెరికాలోని లాస్ వెగాస్, ఫోస్టర్ సిటీ నగరాల మధ్య ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ తరహా వాహనాన్ని జూక్స్ ఉద్యోగులను కూర్చోబెట్టి పరీక్షించారు. రోడ్ల మీద ఎదురయ్యే అన్ని రకాల పరిస్థితులను ఈ వెహికిల్ తట్టుకోగలదు. ఎక్కడైనా గందరగోళం తలెత్తితే.. మనుషుల సాయం తీసుకుంటుంది. సమీప భవిష్యత్తులో ఈ స్వయం చోదక వాహన సౌకర్యాన్ని లాస్‌వెగాస్, శాన్‌ఫ్రాన్సిస్కో నగరాల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జూక్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది.



## 17 ఇంట్లోనే చర్మ వైద్యం

**డాక్టర్** పాల్ క్లేటన్ అనే వైద్యుడు 62 ఏండ్ల మహిళకు కార్టిలేజ్ పునర్నిర్మాణం కోసం స్వల్పస్థాయి లేజర్ చికిత్స చేస్తున్నారు. ఆ సమయంలో ఆమె కాలి చర్మం నవ యవ్వనంగా కనిపించింది. ఇదే ఆయనకు చేతిలోపట్టే లేజర్ గన్ తయారీకి ప్రేరణను ఇచ్చింది. ఈ లేజర్ గన్‌ను ఇంట్లోనే చర్మ సమస్యల చికిత్సకు ఉపయోగించుకోవచ్చు. రోజుకు ఓ పావుగంట దీన్ని ఉపయోగిస్తే ముఖం మీదున్న మచ్చలు, ఎర్రటి మొటిమలు (రోజాసియా), ముడతలు మటుమాయం అయిపోతాయి. ఈ లేజర్ గన్‌ను లైమా సంస్థ మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ''500 మిల్లీవాట్ల లేజర్ మీ చర్మం మరింత కొలాజెన్‌ను ఉత్పత్తిచేసేలా చూస్తుంది'' అంటారు లైమా వ్యవస్థాపకుడు లూసీ గాఫ్. ఈ లేజర్ గన్ మెడికల్ గ్రేడ్ ప్లాస్టిక్ తొడుగులో ఇమిడి ఉంటుంది. ఇంట్లో వాడుకునేందుకు వీలుగా ఉండే ఈ పరికరానికి అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదం లభించింది.



## 18 డ్రీమ్‌ఫార్మ్ ఫ్లూసర్

**నిమ్మ, బత్తాయి,** నారింజ పండ్ల నుంచి పూర్తిగా రసం తీయడం కొంత కష్టమైన పనే. దీన్ని దృష్టిలో ఉంచుకుని నిమ్మ జాతి పండ్లనుంచి మొత్తంగా రసం పిండటానికి ప్రముఖ కిచెన్ వేర్ సంస్థ డ్రీమ్‌ఫార్మ్ సరికొత్త డిజైన్‌తో 'ఫ్లూసర్'ను తీసుకువచ్చింది. నిమ్మజాతి పండ్లను ఇందులో సగం చేసి ఉంచాలి. పండు లోపలినుంచి, బయటినుంచి ఒత్తిడి పడటంతో మామూలు స్క్వీజర్లతో పోలిస్తే రసం ఎక్కువగా తీసుకోవచ్చు. దీని హ్యాండిల్స్ పొడుగ్గా ఉంటాయి. దీంతో చేతుల బలం కూడా ఎక్కువగా ఉపయోగించాల్సిన అవసరం ఉండదు. పైగా గింజలను వేరు చేసి, రసాన్ని మాత్రమే పాత్రలోకి పంపుతుందీ ఫ్లూసర్. దీన్ని సులువుగా శుభ్రం చేసుకోవచ్చు కూడా.